## విజయగణపతి ఆలయ వార్షికోత్సవం

మల్కాజిగిరి: ఉప్పరిగూడలోని విజయగణపతి ఆలయం 20వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు అభిషేకం, అర్చన, గణపతిహోమం, భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, జితేంద్రనాథ్, అమరేశ్వరరావు, ఉమేష్‌సింగ్, బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

కుషాయిగూడ: నల్ల పోచమ్మ దేవాలయాన్ని కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన భాస్కర్‌రెడ్డి సోమవారం సీసీఎస్ ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం అమ్మవారి దేవాలయంలో సీసీఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్‌ను సత్కరించారు. ఇన్‌స్పెక్టర్ సాయిలు, సీసీఎస్ ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు రవిగుప్తా, శ్రీకాంత్‌రెడ్డి, ఆంజనేయులు, రాంరెడ్డి, జనార్దన్, ఈశ్వరయ్య, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


వెంకటేష్ (ఫైల్)

మేడిపల్లి: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కేశవనగర్ కాలనీలో వెంకటేష్ (45)భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి నివాసం ఉంటున్నాడు. కాగా ఉప్పల్ మార్కెట్‌లో గత కొన్నేళ్ల నుంచి హోల్‌సేల్ కిరాణం షాపు నిర్వహిస్తున్నాడు. అప్పులు అధికమవడంతో మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో కుటుంబసభ్యులు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సీఎం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

**నాచారం సభలో మందకృష్ణ మాదిగ**

మల్లాపూర్: సీఎం రేవంత్‌రెడ్డి నిండు సభలో చెప్పినట్టుగా వర్గీకరణ చేస్తే మంచిదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సోమవారం నాచారం సీకే గార్డెన్‌లో సాయంత్రం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్బండ కులాల సహకార సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఫిబ్రవరి 7న 'లక్షల డప్పులు వేల గొంతులు' భారీ సాంస్కృతిక ప్రదర్శన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని నడిపిన నాయకులు మన్మోహన్‌సింగ్ సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ఆ ముగ్గురికి ముఖ్య సలహాదారులు మలాలే అని గుర్తు చేశారు. బహుజన యుద్ధ నౌక ఏపూరి సోమన్న, సింగర్స్ రాంబాబు, వాణి పాటలతో కళాకారుల బృందం జోష్ నింపారు. ప్రొఫెసర్ కాశీం, నల్లా రాధాకృష్ణ, రామకృష్ణ, కేశవులు, నల్లాబాబు, మల్లికార్జున్‌గౌడ్, మహేష్‌కుమార్, మారయ్య, బాబు మాదిగ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదం నుంచి రక్షణేది ?

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ కరువు

- చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ కేబుల్ వైర్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



ప్రగతినగర్ పార్కు వద్ద కిందకు వేలాడుతున్న కేబుల్ వైర్లు


నెహ్రూనగర్ రాధాదేవి అపార్టుమెంట్ వద్ద..


గోఖలేనగర్ బాల భారతి స్కూల్ ఎదురుగా..

రామంతాపూర్ : ఉప్పల్ భగాయత్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు బస్తీల, కాలనీల అంతర్గత రోడ్లలో పార్కులు, ఆటస్థలాల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె లేకపోవడంతో పాటు చేతికందే ఎత్తులో కేబుల్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రగతినగర్‌లోని డాన్‌బాస్కో అనాథ ఆశ్రమం వద్ద ఉన్న పార్కు వద్ద నెహ్రూనగర్‌లోని రాధాదేవి అపార్టుమెంట్, చిన్నచెరువు వద్ద గోఖలేనగర్ బాల భారతి పాఠశాల ఎదురుగా రాంరెడ్డినగర్, కేసీఆర్‌నగర్, శ్రీనగర్‌కాలనీ, వెంకట్‌రెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కరువైంది. దీనిపై ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

**ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలి..**



రామంతాపూర్ భగాయత్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ బస్తీలు, కాలనీల్లో అంతర్గత రోడ్లలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలు ఏర్పాటు చేసే విధంగా ప్రజా ప్రతినిధులు చొరవ చూపి అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– ఎర్రం శ్రీనివాస్, ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు


చిన్న చెరువు వద్ద ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

## సంస్కృత భాష అభ్యాసంపై వర్క్‌షాప్



అల్వాల్: ఉస్మానియా యూనివర్సిటీ సంస్కృత అకాడమీ, సాంస్కృతిక భాషా విభాగం సంయుక్తాధ్వర్యంలో సోమవారం సైనిక్‌పురి భవన్స్ కళాశాలలో 'సాంస్కృతిక శిక్షణ, అభ్యాసం ఎదురయ్యే సమస్యలు, సవాళ్లు' అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సంస్కృత అకాడమీ డైరెక్టర్ ప్రొఫెసర్ మధుసూదన్ హాజరై మాట్లాడారు.

## ఉద్యమకారిణి డోలి కృష్ణవేణికి నివాళి

అల్వాల్: తెలంగాణ ఉద్యమకారిణి డోలి కృష్ణవేణి సంతాప సభ బొల్లారంలోని ఉద్యమకారుల ఫోరం కార్యాలయంలో మల్కాజిగిరి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో పుట్నాల కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యమకారులు మాట్లాడుతూ.. డోలి కృష్ణవేణి తెలంగాణ ఉద్యమంలో ఎన్నో సేవలు చేశారన్నారు. సురేందర్‌రెడ్డి, సంతోష్, శోభన్‌బాబు, చంద్రశేఖర్, ముత్యాలు, గోపాల్, సుధీర్, సుకుమార్, బాలనర్సింహ, జమ, విలియం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధుల ఫిర్యాదులు !


ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ప్రజల కంటే అధికంగా ప్రజా ప్రతినిధులు ఫిర్యాదులు చేస్తున్నారు. సామాన్య ప్రజల సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు వస్తుంటారు. ఇక్కడి కార్పొరేటర్లు, ఎమ్మెల్యే పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం జరిగిన ప్రజావాణిలో ప్రజల నుంచి 2 ఫిర్యాదులు అందాయని, అధికారులు వివరించారు. ఇంజినీరింగ్ విభాగంలో పెండింగ్ పనులు, ఆస్తిపన్ను వివరాల్లో యజమానుల పేర్లు తప్పుగా నమోదు అవుతున్నాయని, ఓటరు నమోదులో రోహింగ్యాలు, ముస్లింల పేర్లు ఇక్కడ లేకున్నా నమోదు చేస్తున్నారని ఆరోపించారు. సఫిల్‌గూడ ట్యాంక్ బండ్‌పై నూతన టాయిలెట్స్ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామని, కార్పొరేటర్ శ్రవణ్ తెలిపారు.

**డివిజన్ సమస్యలపై సమీక్ష**

అల్వాల్: వెంకటాపురం డివిజన్ సమస్యలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయం ప్రజావాణిలో జెడ్సీ అపూర్వ చౌహాన్‌ను కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మచ్చబొల్లారం డివిజన్‌లోని 7 జేఏసీ కాలనీలో డ్రైన్ ఔట్‌లెట్ సమస్య, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని, అధికారుల నిర్లక్ష్యంతోనే భారీ అపార్టుమెంట్ల నుంచి ఏడు జేఏసీ కాలనీలోకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అక్రమ కట్టడాలపై తగిన చర్యలు తీసుకోవాలని, కొందరు అధికారులు ప్రోటోకాల్‌ను పాటించడం లేదని మండిపడ్డారు. దీనిపై త్వరలోనే అల్వాల్ సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ త్వరలోనే అల్వాల్ సర్కిల్ పరిధిలో స్వయంగా పర్యటించి సమస్యను పరిష్కరిస్తానన్నారు. మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్లు శాంతిశ్రీనివాస్‌రెడ్డి, సబిలఅనిల్‌కిషోర్‌గౌడ్, నాయకులు రమేష్, పరమేష్, లక్ష్మణ్‌యాదవ్, అనిల్‌కిషోర్, వెంకటేష్, జావేద్ యాదవ్, సందీప్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, సతీష్, సురేష్, హనుమాన్‌చారి తదితరులు పాల్గొన్నారు.


జోనల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

## కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ నిరసన

మల్కాజిగిరి: కేంద్రప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌పై కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, జితేంద్రనాథ్‌లు మాట్లాడుతూ.. కేంద్రం ఓటు బ్యాంకు కోసమే బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని, రాష్ట్రాల సమస్యలను పరిగణలోకి తీసుకోలేదని విమర్శించారు.



## క్రీడా పోటీల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థిని ప్రతిభ



ఉప్పల్: ఉప్పల్ జీహెచ్ఎంసీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రనుష 100 మీటర్ల పరుగు పందెంలో జిల్లాస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించింది. బహుమతిని ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి చేతులు మీదుగా సోమవారం అందుకుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డా. రవిప్రసాద్, తిరుపతయ్య, జె.విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం : సీపీఎం

ఉప్పల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ ప్రాంతానికి తీరని అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ సీపీఎం పార్టీ ఉప్పల్ సర్కిల్ ఆధ్వర్యంలో సోమవారం ఉప్పల్ రింగ్ రోడ్డులో నిరసన చేపట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 2025 బడ్జెట్‌లో తెలంగాణ ప్రాంతానికి నిధులు కేటాయించలేదని వారు దుయ్యబట్టారు. సర్కిల్ కార్యదర్శి వెంకన్న, ఎస్. నాగరాజు, ఊర్మిళ, ఉపేందర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సమస్యలు పరిష్కరించాలని వినతి


డీసీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

అల్వాల్: వెంకటాపురం డివిజన్‌లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ బీజేపీ నేతలు సోమవారం అల్వాల్ సర్కిల్ కార్యాలయంలోని ప్రజావాణిలో డీసీ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలో అంతర్గత రోడ్లు, విద్యుత్ సౌకర్యం మెరుగుపర్చాలని, ఇందిరాగాంధీ విగ్రహం నుంచి ఇందిరానగర్ వరకు రోడ్డు వేయాలని కోరారు. సుజాత, శ్యామల, రవికిరణ్ ఆంథోని, మల్లిఖార్జున్‌గౌడ్, లక్ష్మణ్, అజిత్‌సాయి, శ్రీనాథ్, జయకుమార్ పాల్గొన్నారు.



## అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని..

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఘనాపూర్ ఓ ప్రైవేటు కళాశాలలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నిలిపేయాలని కోరుతూ స్థానికులు మహేశ్వర్‌గౌడ్, కృష్ణారెడ్డి అనే వ్యక్తులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వేనెంబర్ 1140, 1141లో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిపై చట్టపరమైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

## కాంగ్రెస్ ఓబీసీ సెల్ చైర్మన్‌గా వీర భాస్కర్‌రావు


నియామకపత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఓబీసీసెల్ చైర్మన్‌గా పసుపులేటి వీర భాస్కర్‌రావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నేతలు సోమవారం ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో గత 25 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేసినందుకు గుర్తించి పదవీబాధ్యతలు అప్పగించారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డి, నేతలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్యయాదవ్, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు రవి ముదిరాజ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఖబ్రస్థాన్‌లో వసతుల కల్పనకు కృషి



ఉప్పల్: ఖబ్రస్థాన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్ అన్నారు. ఖబ్రస్థాన్‌లో కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని, వాటిని పరిశీలించాల్సిందిగా ముస్లిం నేతలు కార్పొరేటర్‌ను కోరారు. దీంతో ఆమె సోమవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి గ్రేవ్‌యార్డును పరిశీలించారు. షెడ్డు నిర్మాణం, రోడ్డు, హైమాస్ట్ లైట్ల ఏర్పాట్లు తదితర వసతులు కల్పించనున్నట్లు వివరించారు. డీఈ వెన్నెల, ఏఈ వినీత్‌రావు, బీఆర్ఎస్ నాయకుడు బన్నాల ప్రవీణ్ పాల్గొన్నారు.

## ముగిసిన బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ

**విజేతగా నిలిచిన ఏఎస్‌రావు నగర్ జట్టు**

మణికొండ: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం మణికొండలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఘనంగా జరిగాయి. ఇందులో మణికొండ, ఏఎస్‌రావు నగర్, హన్మకొండ, బీహెచ్‌ఈఎల్, కేపీహెచ్‌బీ కాలనీ, గాయత్రినగర్, గట్టుప్పల్, చేవెళ్ల, కరీంనగర్, సంగారెడ్డి, మెదక్ తదితర ప్రాంతాల జట్లు పాల్గొన్నాయి. పోటీలను మణికొండ మున్సిపాలిటీ డీఈ శివసాయి, అత్తాపూర్‌లోని జర్మెంటిస్ ఆసుపత్రి జనరల్ మేనేజర్ సంతోష్ ఆదివారం ప్రారంభించారు. సోమవారం జరిగిన ఫైనల్ పోటీలలో టోర్నమెంట్ విజేతగా ఏఎస్‌రావు నగర్ కాలనీకి చెందిన మారుతి బాల్ బ్యాడ్మింటన్ జట్టు నిలిచింది. రెండో స్థానంలో బీహెచ్‌ఈఎల్ సంకల్ప బాల్ బ్యాడ్మింటన్ జట్టు, మూడో స్థానంలో హన్మకొండ, నాల్గవ స్థానంలో మణికొండ జట్లు నిలిచాయి. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా సాయికిరణ్, రెండవ ఆటగాడిగా శశిలు నిలిచారు. ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, సహాయ కార్యదర్శి కమల్, అత్తాపూర్ జర్మెంటిస్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ జావేద్ జార్ ఖాన్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ వారికి నచ్చిన క్రీడను ఎంచుకుని సాధన చేసి రాణించాలన్నారు. ఆటలతో క్రీడా సంబంధాలతోపాటు మానవ సంబంధాలు కూడా మెరుగుపడటమే కాకుండా పరిపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటారన్నారు. త్వరలోనే జూనియర్ పోటీలను నిర్వహిస్తామన్నారు. మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్, ఉపాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నాయకులు నరహరి శాస్త్రి, సీతారామరాజు, రమేష్, రామిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, రాజు, ఆసిమ్, నవీన్‌కుమార్, ఎ.లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు విజేతలకు మెమోంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు.


విజేతలతో ముఖ్య అతిథులు


విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సునీత


ఆనంద శివకామేశ్వరి ఆశ్రమంలో సరస్వతి పూజలో పాల్గొన్న మహిళలు

# వైభవంగా వసంత పంచమి

**స్కూళ్లలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం**





ఉప్పల్, మల్కాజిగిరి జోన్ పరిధిలో వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం పలు పాఠశాలల్లో పండితులు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఆలయాలు, కళాశాలల్లో సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వసంత పంచమి విశిష్టత గురించి పండితులు వివరించారు. సరస్వతి దేవి ఆశీస్సులు ఉన్న వారి జీవితాల్లో అజ్ఞానమనే చీకట్లు తొలగి జ్ఞానమనే వెలుగులు నిండాలని ఆకాంక్షించారు.

– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ బృందం.


విద్యాభ్యాసం చేయిస్తున్న వేదపండితుడు


సరస్వతీ శిశు మందిర్‌లో..


వసంత పంచమి వేడుకల్లో ప్రజా ప్రతినిధులు